క్లుప్తంగా

వాగు వద్దే ఎస్సై భోజనం



కొత్తగూడ: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎస్సై కుశకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాగుల వద్ద తిరుగుతూ పరిస్థితిని సమీక్షించారు. దీంతో ఎస్సై వాగు వద్దనే భోజనం చేశాడు.

సకాలంలో చికిత్స అందక వ్యక్తి మృతి

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఏర్పుల రామకృష్ణ(40) అనారోగ్యానికి గురై సకాలంలో చికిత్స అందక మృతి చెందాడు. మూడు రోజుల క్రితం రామకృష్ణ జ్వరంతోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివారం పరిస్థితి విషమించడంతో రామకృష్ణను కుటుంబ సభ్యులు వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా వరదలతో రోడ్డు మార్గాలు మూసుకుపోయాయి. సకాలంలో చికిత్స అందక మృతి చెందాడు. మృతుడికి భార్యా, పిల్లలు ఉన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

కురవి: మతిస్థిమితం లేకపోవడంతో ఓ యువకుడు ఆదివారం రాత్రి కురవి మండలం నేరడ శివారు రాయినిపట్నం వద్ద వాగు వద్దకు వెళ్తుండగా 100 డయల్‌తో స్పందించిన కురవి పోలీసులు యువకుడిని కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం భారీ వర్షం కురుస్తుండడంతో నేరడ మార్గంలో ఏపీలోని గుంటూరు జిల్లా పచ్చలపాడిపారు గ్రామానికి చెందిన ముళ్లపూడి హర్షవర్ధన్ రాయినిపట్నం వద్ద ఉన్న వాగు దాటుతుండగా అందులో పడిపోయాడు. గమనించిన స్థానికులు 100కు డయల్ చేశారు. కురవి ఏఎస్సై సదయ్య, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, కానిస్టేబుల్ కాశీరాం హుంటాహుటిన వాగు వద్దకు వెళ్లి యువకుడిని కాపాడారు. తల్లిదండ్రులకు అప్పగించారు.

రూ.15కోట్లు మంజూరు చేయాలి

మహబూబాబాద్: భారీ వర్షాలతో మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రెయినేజీలు, పైపులైన్లు, ఇతరత్రా చాలా వరకు దెబ్బతిన్నాయని వాటి మరమ్మతులకు ప్రభుత్వం రూ.15కోట్లు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, అజయ్‌సారథిరెడ్డి, సోమయ్య, జనార్దన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార్ల: గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఆసక్తి గల వారు ఈనెల 5వ తేదీ లోపు డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు సోమవారం తెలిపాడు. ఈనెల 6వ తేదీన మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

'మంత్రిగారు మా గోస వినండి'



కేసముద్రం: మండల కేంద్రంలోని పలువురు వరద బాధితుల ఇళ్లను సోమవారం మంత్రి సీతక్క సందర్శించారు. తిరిగి మంత్రి నెల్లికుదురు వైపునకు వాహనంలో వెళ్తుండగా, ఒక్కసారిగా సంతోష్‌నగర్ కాలనీకి చెందిన పలువురు వరద బాధిలు తమ ఇళ్లను కూడా చూసి, ఆదుకోవాలంటూ కాన్వాయికి అడ్డంగా పరుగెత్తుకుంటూ వచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు.

వరదలో కొట్టుకొచ్చిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బయ్యారం: మండలంలోని జగ్గుతండా సమీపంలో ప్రవహించే పాకాలేటి వరదలో ఓ గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొచ్చి చెట్టుకు తట్టుకుని ఆగింది. రెండురోజులు ఉధృతంగా ప్రవహించిన పాకాలేరు సోమవారం కొంత తగ్గుముఖం పట్టడడంతో రైతులు వాగు పక్కన తమ పంట పొలాల వద్దకు వెళ్లారు. జమాయిల్‌తోట వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో పోలీసులకు తెలిపారు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో ఎగువప్రాంతం నుంచి కొట్టుకొచ్చి ఉండొచ్చని స్థానికులు పేర్కొన్నారు.

ఆర్థికసాయం

గూడూరు: అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కురివింద యాకలక్ష్మి, గట్టిపెల్లి వినోదల ఇంటి గోడలు కూలిపోయాయి. విషయం తెల్సుకున్న డీటీ కోమల గట్టిపెల్లి వినోద ఇంటికి వెళ్లి నష్టపరిహారం అందించే ఏర్పాటు చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు బాధితురాలికి కొంత నగదును అందించారు.

వర్షం తగ్గింది.. నష్టం మిగిలింది

నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా ఆగమాగమైంది. గ్రామాలల్లో చెరువులు, కుంట కట్టలు తెగిపోయాయి. ఇళ్లు నేలమట్టమయ్యాయి. వరద బీభత్సానికి పంటలు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులు కోతకు గురై కొట్టుకుపోయాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ముంపునకు గురైన ప్రాంతాల్లో పలువురు అధికారులు పర్యటించారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. - సాక్షి నెట్‌వర్క్



కురవి: ముత్యాలమ్మ చెరువు కట్ట కింద కోతకు గురైన రోడ్డు



నెల్లికుదురు: మధనతుర్తి సమీపంలో కొట్టుకుపోయిన రోడ్డు



తొర్రూరు: అమ్మాపురం వద్ద కొట్టుకుపోయిన రోడ్డు



నర్సింహులపేట: రామన్నగూడెం, జయపురం వద్ద తెగిన రోడ్డు



డోర్నకల్: పేరుకుపోయిన ఒండ్రు మట్టిని తొలగిస్తున్న డోజర్



డోర్నకల్: వాగు సమీపంలో తాటి చెట్టుపై పడిన విద్యుత్ స్తంభం



కొత్తగూడ: నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



దంతాలపల్లి: గున్నెపల్లి గ్రామంలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి



కురవి: సీరోలు మండలం కొత్తూరు గ్రామానికి వెళ్లే మార్గంలో కోతకు గురైన బీటీ రోడ్డు



దంతాలపల్లి: నెలకొరిగిన భారీ వృక్షం, తెగిపడిన విద్యుత్ తీగలు



మరిపెడ: బీచ్‌రాజ్‌పల్లి శివారులో వరి పొలంలో ఇసుకమేటలు



నెల్లికుదురు: కట్ట తెగిపోవడంతో ఎడారిగా మారిన రావిరాల గ్రామ చెరువు



దంతాలపల్లి: కుమ్మరికుంట్ల గ్రామంలో కూలిన ఇంటి వద్ద బాధితురాలు



మరిపెడ: తానంచర్ల శివారులో నీట మునిగిన పత్తి చేను



నెల్లికుదురు: కొట్టుకుపోయిన రావిరాల పరిధిలోని వరి పంటలు



గార్ల: పాకాల ఏటి పరివాహక ప్రాంతంలో నీట మునిగిన వరిపంట



నెల్లికుదురు: బ్రాహ్మణకొత్తపల్లి నుంచి శ్రీహరి తండాకు వెళ్లే దారి

రిజర్వాయర్ ఏర్పాటుపై అపోహలొద్దు

● ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

డోర్నకల్: సీతారామా ప్రాజెక్టుకు సంబంధించి రిజర్వాయర్ ఏర్పాటుపై ప్రజలు అపోహలతో ఆందోళనకు గురి కావద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ తెలపారు. సీరోలు మండలం అందనాలపాడు, మోదుగ్గడ్డతండా, డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామాల్లోని ఆకేరువాగు ముంపు ప్రాంతాల్లో సోమవారం డాక్టర్ రాంచంద్రునాయక్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదలతో మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ తదితర జిల్లాల్లో భారీగా నష్టం జరిగిందన్నారు. వరద నష్టం పది వేల కోట్ల రూపాయల వరకు ఉండొచ్చన్నారు. అందనాలపాడు సమీపంలో సీతారామా ప్రాజెక్ట్ రిజర్వాయర్ నిర్మిస్తున్నారంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారని, రిజర్వాయర్‌తో ఎవరికీ నష్టం జరగదన్నారు. దూరప్రాంతాల్లో గుట్టల్లో రిజర్వాయర్ నిర్మించే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, తాళ్లూరి హనుమంతరావు, కాసం శేఖర్, కాలం రవీందర్‌రెడ్డి, జవ్వాది రాంప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

తొర్రూరు రూరల్: మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పంట నష్టపోయినా రైతాంగాన్ని, ఇళ్లు కూలిల బాధితులను ఆదుకుంటామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపురం, నాంచారీమడూరు, తొర్రూరు గ్రామాల శివారులో ఆకాల వర్షాలతో పాడైన వరి, బొప్పాయి, మొక్కజొన్న, పెసర, పత్తి వంటి పంటలను ఆయాశాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరిశీలించారు. ఆమె వెంట నాయకులు ఉన్నారు.



బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

వైఎస్సార్ సేవలు వెలకట్టలేనివి



తొర్రూరు: వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నాయకులు



గూడూరు: వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బయ్యారం: గంధంపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: దివంగత నేత, మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, వంటి ఎన్నో సంక్షేమ పథకాలు వైఎస్సార్ హయాంలో అమలు జరిగాయన్నారు. రాజశేఖర రెడ్డి కాంగ్రెస్‌కు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు.

అధిక నిధులు కేటాయించాలి

నెహ్రూసెంటర్: కురుస్తున్న వర్షాల కారణంగా మహబూబాబాద్ జిల్లా అన్ని విధాలుగా తీవ్రంగా నష్టపోయిందని జిల్లాకు కేంద్రం, రాష్ట్రం అధిక నిధులు కేటాయించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

నెహ్రూసెంటర్: వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. వర్షపు వరద ప్రాంతాల ప్రాంతాలను సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, సందీప్, జ్ఞానేశ్వర్, వీరన్న పాల్గొన్నారు. వర్షాలు వరదల కారణంగా నష్టపోయిన రైతులను, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న కోరారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



మరిపెడ: బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



నెల్లికుదురు: రావిరాలలో దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

మరిపెడ: మండలంలోని సీతారాంనాయక్ తండా వరద బాధితులకు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందే విధంగా చూస్తామన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

నెల్లికుదురు: మండలంలోని రావిరాలలో వరద బాధితులకు సోమవారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ స్థానిక నాయకులతో కలిసి దుప్పట్లు, దుస్తులు, నిత్యావసర వస్తువులను అందించారు.

కురవి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి సక్కుబాయికి చెందిన పెంకుటిళ్లు పూర్తిగా కురవడంతో నిత్యావసర సరుకులు అన్ని తడిసి ముద్దయ్యాయి. కురవికి చెందిన గంగరబోయిన రఘు తన కుమారుడు రిహాన్స్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని నిత్యావసర సరుకులు అందజేశాడు.

సంక్షిప్త సమాచారం

వైద్యులు అందుబాటులో ఉండాలి

గూడూరు: సీజనల్ వ్యాధులకు తోడు వర్షాలతో జ్వరంతో బాధపడుతున్న రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీడీఓ వీరస్వామి, డీటీ కోమల అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీని సోమవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వారు తనిఖీ చేశారు.

నర్సయ్య మృతదేహం లభ్యం

తొర్రూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులోని వాగులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన గుండాల నర్సయ్య మృతదేహాన్ని సోమవారం ఉదయం గుర్తించారు. శనివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి నర్సయ్య ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

కురవి: మండల కేంద్రంలోని పాత ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ ఆదేశానుసారం హైమాస్ట్ లైట్లను సోమవారం కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్ ప్రారంభించాడు.

బియ్యం అందజేత

నెల్లికుదురు: మండలంలోని రావిరాల గ్రామంలో వరద బాధితులకు ప్రభుత్వం నుంచి అందించిన బియ్యాన్ని అందించినట్లు తహసీల్దార్ కోడిచింతల రాజు సోమవారం తెలిపారు. గ్రామంలో వరద కారణంగా 72 ఇళ్లలోకి వరదనీరు చేరి నష్టపోయారని, దీంతో 5గృహాలు పూర్తిగా కూలిపోగా, 13 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన సమాచారం ప్రకారం 92 గొర్రెలు, మేకలు, 2పాడిగేదెలు మృతి చెందగా రెండు మోటార్ సైకిళ్లు, ఒక ట్రాక్టర్, ఆటో ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

గార్ల: మండలంలోని పురుషోత్తాయగూడెం సమీపంలో ఆకేరు వరద ఉధృతికి కారుతో సహా కొట్టుకుపోయి మృతిచెందిన తండ్రి మోతీలాల్, కూతురు అశ్విని కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షలఎక్స్‌గ్రేషియా చెల్లించాలని లంబాడీ హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

ఆలయంలో చోరీ

దంతాలపల్లి: మండలం బొడ్లాడ గ్రామంలోని సీతారామ ఆలయంలోని ఆదివారం రాత్రి దుండగులు చోరీ చేసి, రూ.14వేల విలువ చేసే వస్తువులను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం విషయం తెలుసుకున్న ఎస్సై రాజు, ఏఎస్సై చందర్, కానిస్టేబుల్ మంగిలాల్‌ను పంపించాడు. పగులకొట్టిన తాళం, దుండగులు ఉపయోగించిన గడ్డపారను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థినుల ఇంటిబాట



మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ బాలికల హాస్టల్‌లోని సుమారు 750 మంది విద్యార్థులు చదువుతున్నారు. హాస్టల్‌లో సెప్టిక్ ట్యాంక్ నిండి మురుగు పైకి చేరుతుండడంతో విద్యార్థినులు దుర్వాసనను భరించలేక ఇంటి బాట పడుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



బాధితులతో మాట్లాడుతున్న నెహ్రూనాయక్

డోర్నకల్: భారీ వర్షాలతో వాగులు పొంగుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ మాళోత్ నెహ్రూనాయక్ కోరారు. మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో సోమవారం ముంపు ప్రాంతంలో నెహ్రూనాయక్ పర్యటించి బాధితులతో మాట్లాడారు . వరదలతో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. ముల్కలపల్లి ఆకేరువాగుపై కొట్టుకుపోయిన బ్రిడ్జిని నేషనల్ హైవే ఈఈ యుగేంధర్ పరిశీలించారు.